క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం

నర్సంపేట : ఈనెల 14న నిర్వహించనున్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలకు హాజరు కావాల్సిందిగా కోరుతూ స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి దళిత, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు గద్ద వెంకటేశ్వర్లు, కల్లెపల్లి ప్రణయ్‌దీప్ శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం వెంకటేశ్వర్లు, ప్రణయ్‌దీప్ మాట్లాడారు. వేడుకలకు ఎమ్మెల్యేను ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలోవిద్యార్థి సంఘాల ప్రతినిధులు బొట్ల నరేశ్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'సీఎంఆర్‌ఎఫ్' అందజేత



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఖాదర్‌పేటకు చెందిన సింగిరెడ్డి ప్రతాప్‌కు మంజూరైన రూ.23 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ మహేందర్ శనివారం అందజేశారు. అనంతరం మహేందర్ మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో ప్రతాప్‌కు చెక్కు మంజూరైందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పుల దేవేందర్, చాపల మధుకర్, పెంతల రాజు, చెవ్వ యాదగిరి, చెట్టి రవి, కొనుకటి కుమారస్వామి, దామెరుప్పల రాజ్‌కుమార్, మేడిద అశోక్, పెండ్లి రాజు, కూస సాయిబాబా, కద్దూరి రాజ్ కుమార్, చెంచు నాగరాజు, పెండ్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళకు చేయూత



పర్వతగిరి : మండల కేంద్రంలో మతిస్థిమితం లేని మహిళను సఖి కేంద్రం నిర్వాహకులు శనివారం చేరదీశారు. అడ్మినిస్ట్రేటర్ శ్రీలత ఆదేశానుసారం కౌన్సిలర్ నూర్జహాన్, కేస్ వర్కర్ స్వప్న, పోలీసులు సోమారం గ్రామం వైపు వెళ్తున్న ఆ మహిళ ఆచూకీ కనుగొన్నారు. తన పేరు మల్లమ్మ అని, హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ కొత్తపేట దగ్గర నివాసం ఉంటానని ఒక క్యాంటీన్ పేరు చెప్పింది. పోలీసుల సాయంతో మహిళను వాహనంలో ఎక్కించి వరంగల్ సర్వీస్ సెంటర్‌కు తీసుకెళ్లారు. అనంతరం ఆమె చెప్పిన వివరాల ఆధారంగా అడ్రస్ ట్రేస్ అయ్యే వరకు వరంగల్‌లోని కాశిబుగ్గ మదర్‌థెరిసా హోంలో చేర్పించినట్లు సఖి కేంద్రం నిర్వాహకులు తెలిపారు.

కులవివక్షపై పోరాడాలి



నర్సంపేట : డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, జ్యోతిరావు పూలే స్ఫూర్తితో కులవివక్షపై పోరాడాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్ కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అనేక పురోగతి సాధించినా సమాజంలో వివక్ష కొనసాగుతోందన్నారు. వివక్షను రూపుమాపే దిశగా ఈనెలను మహనీయుల మాసంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కులవివక్షపై తలపెట్టిన పోరాటాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సమావేశంలో సంఘం పట్టణ కార్యదర్శి మొల్గురి రాజు, అధ్యక్షుడు సింగారపు బాబు, సభ్యులు జన్ను రమేశ్, ధార మహేందర్, మహేశ్, ప్రశాంత్, మల్లేశ్ పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

రాయపర్తి : పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిపై తప్పుడు ప్రచారం చేసిన ఓ చానల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు శనివారం రాయపర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కుటుంబంపై తప్పుడు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. ఇలాంటి వికృత చేష్టలు చేస్తే ప్రజాక్షేత్రంలో గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టీఎం కృష్ణమాచార్యులు, బిల్లా సుధీర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సమ్మయ్య, సుదర్శన్‌రెడ్డి, మాచర్ల ప్రభాకర్, అఫ్రోజ్, గారె భిక్షపతి, యాదవరెడ్డి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

పర్వతగిరి : మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త మొగుళ్ల వెంకన్న శనివారం మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మనోజ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, నాయకులు దేవేందర్, రతన్, తదితరులు పాల్గొన్నారు.

చింతగడ్డతండా రోడ్డుకు మోక్షమెప్పుడో?

● గుంతలమయం, కంకర తేలిన వైనం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని చింతగడ్డతండాకు చెందిన రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. కంకర తేలింది. దీంతో ఈ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే తండావాసులు బెంబేలెత్తుతున్నారు. గుంతల్లో పడి రోడ్డు ప్రమాదాలు బోటు చేసుకున్న ఘటనలూ ఉన్నాయి. రోడ్డు వేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలాల్లేవన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నర్సంపేట మండలంలోని రాజుపేట శివారులోని చింతగడ్డతండాలో 60 కుటుంబాలు నివసిస్తుండగా జనాభా సుమారు 200గా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. తండా నర్సంపేట–పాకాల కొత్తగూడ ప్రధాన రహదారి నుంచి కిలోమీటర్ దూరంలో ఉంటుంది. రోడ్డు మొత్తం గుంతలమయంగా, కంకర తేలి ఉండడంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డు మీదుగా వెళ్లాలన్నా, తండాకు రావాలన్న తిప్పలు తప్పడం లేదంటూ ప్రజలు వాపోతున్నారు. రోడ్డు పక్కనే ఉన్న కుంట నుంచి పంటల సాగు కోసం నీరు రోడ్డు మీదుగా వెళ్తుంది. ఈ క్రమంలో నీటి ప్రవాహంతో రోడ్డుపై భారీ గుంతలు పడ్డాయి. వర్షాకాలంలో గుంతలు దాటడానికి సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. కనీసం నీటి ప్రవాహం కోసం పైపులు కూడా వేయని దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో వర్షాకాలం వచ్చిందంటే తండావాసులకు తండ్లాట తప్పని పరిస్థితి నెలకొంది. రోడ్డు మొత్తం గుంతలుమయం కావడంతో రాత్రివేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే నరకం కనిపిస్తోందని తండావాసులు తెలిపారు. తండాలో సైడ్ డ్రెయినేజీ, విద్యుత్ స్తంభాలు సరిగా లేని దారుణ పరిస్థితి కళ్లకు కడుతోంది. విద్యుత్ వైర్లు లూజుగా ఉండడంతో గాలిదుమారం వచ్చినప్పుడు రైతులు, ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. వేసవికాలం కావడంతో తాగునీటి సమస్య తలెత్తోంది. భూగర్భ జలాలు అడుగంటి చేతి పంపులు ఉపయోగపడడం లేదు. చాలా సేపు కొట్టినా నీరు వచ్చే పరిస్థితి లేదు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి కుంట నీళ్లు వెళ్లేలా కల్వర్టు నిర్మింపజేయడంతోపాటు సీసీ రోడ్డు వేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని తండావాసులు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన చింతగడ్డతండా రోడ్డు

తక్షణమే రోడ్డు వేయాలి



నర్సంపేట–పాకాల్ కొత్తగూడ రోడ్డు నుంచి తండాకు వచ్చే రోడ్డు సుమారు కిలోమీటరు ఉంటుంది. రోడ్డు కంకర తేలి, గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే రోడ్డు వేయించి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలి.

– గుగులోతు రవి, తండా పెద్దమనిషి

పరిష్కారానికి కృషి చేస్తాం



చింతగడ్డతండా రోడ్డు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. రోడ్డు ప్రధాన సమస్య. త్వరలో రోడ్డు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హామీ ఇచ్చారు. సైడ్ డ్రెయినేజీ, తాగునీటి, ఇతర అన్ని సమస్యలనూ క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరలోనే పరిష్కరించే దిశగా చొరవ తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, ఎంపీడీఓ, నర్సంపేట

రజతోత్సవ సభను విజయవంతం చేయండి

● మాజీ మంత్రి దయాకర్‌రావు

వర్ధన్నపేట : హనుమకొండ జిల్లా పరిధిలోని ఎలకతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. పట్టణంలోని ఎంఎం గార్డెన్‌లో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం శ్రేణులు పెద్దగా కష్టపడాల్సిన పని లేదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ చేసిన పనులే పార్టీకి, శ్రేణులకు శ్రీరామ రక్ష అని తెలిపారు. కేసీఆర్ ముందు చూపుతో తండాలను గ్రామపంచాయతీలుగా ఉన్నతీకరించగా కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ బిల్లులు చెల్లించడానికి కూడా ముందుకు రావడం లేదన్నారు. రైతుబంధు ఎగ్గొట్టిన మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీ కోసం, ప్రజల కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు.

సభకు ప్రజాదరణ

నల్లబెల్లి : బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజాదరణ వెల్లువెత్తుతోందని పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్ తెలిపారు. మండలంలోని శనిగరం, అర్వయ్యపల్లి, కన్నారావుపేట గ్రామాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాధించి పదేళ్లలో ఊహించని రీతిలో అభివృద్ధి చేసిన పార్టీగా ప్రజలు గుర్తిస్తున్నారని చెప్పారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ బానోత్ హరినాథ్ సింగ్, నాయకులు గందె శ్రీనివాస్ గుప్తా, ఇంగ్లీ శివాజీ, తక్కళ్లపల్లి మోహన్‌రావు, మంద రాజిరెడ్డి, నానబోయిన రాజారాం, తిప్పని రవిందర్, ఊటుకూరి అశోక్, భూక్య బాలరాజు, మాడిశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : మాట్లాడుతున్న దయాకర్‌రావు

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నర్సంపేట రూరల్ : మండలంలోని గుర్రాలగండి రాజపల్లిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మోటూరి రవి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం రవి మాట్లాడారు. సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తుత్తురు కోమల, రమేశ్, బండారు శ్రీలత, పురాణి రవీందర్, అల్లి రవి, తుత్తురు సాంబయ్య, పత్రి కుమారస్వామి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి



నెక్కొండ : మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఘనంగా హనుమాన్ జయంతి నిర్వహించారు. అర్చకుడు బూరుగుపల్లి భవిశాస్త్రి ఆధ్వర్యంలో హనుమాల మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ విగ్రహానికి చందనం వేయించి పలువురు మొక్కులు చెల్లించారు.

చిన్నారిని చితకబాదిన ఘటనపై విచారణ



పర్వతగిరి : చిన్నారిని ఉపాధ్యాయురాలు చితకబాదిన ఘటనపై మండల కేంద్రంలోని లయోలా స్కూల్‌లో ఎంఈఓ గాయపు లింగారెడ్డి శనివారం విచారణ చేపట్టారు. అనంతరం ఎంఈఓ మీడియాతో మాట్లాడారు. సదరు ఉపాధ్యాయురాలిని పాఠశాల యాజమాన్యం తొలగించిందని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని లిఖిత పూర్వక హామీ ఇచ్చిందని చెప్పారు. తొలుత స్కూల్ ఉపాధ్యాయులు, నిర్వాహకులతో ఎంఈఓ అడిగి తెలుసుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాయపర్తి : మండలంలోని సన్నూరులో బాల వికాస ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మెయిన్ కోఆర్డినేటర్ రమ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. బాటసారుల దాహార్తిని తీర్చేలా దాతలు దీకొండ సంపత్, మౌనిక సహకారంతో చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు పెదగాని వెంకన్న, కోఆర్డినేటర్ సరిత, నర్సమ్మ, నాగమ్మ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ ధర పెంపు సరికాదు

● యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్

పర్వతగిరి : వంట గ్యాస్ ధర పెంపు సరికాదని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ అన్నారు. గ్యాస్, చమురు ధరల పెంపును నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను శనివారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలపై భారాలు మోపుతూ కార్పొరేట్ సంస్థలకు, సంపన్నులకు రాయితీలిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతూ పేదలను ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. నిత్యం ప్రజలపై భారాలు మోపుతున్న ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. సూపర్‌పవర్‌గా మారుస్తామని ప్రగల్భాలు పలికి దేశాన్ని పాతాళానికి తొక్కేస్తున్నారని ధ్వజమెత్తారు. పెంచిన గ్యాస్, ఇతర నిత్యావసరాల ధరలు వెంటనే తగ్గించకపోతే రానున్న ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాల్సిందేనని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూక్య విజేందర్, మండల ఉపాధ్యక్షుడు మూడు దేవరాజ్, నాయకులు బొట్ల కుమార్, అనిల్, చిన్నపెల్లి శ్రావణ్, బొట్ల రమేశ్, లోకేశ్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాచైతన్యమే స్ఫూర్తి యాత్ర ధ్యేయం

● టీఏఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య

వర్ధన్నపేట : ప్రజలను చైతన్యవంతం చేయడమే మహనీయుల స్ఫూర్తి యాత్ర ధ్యేయమని తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టీఏఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చ రాజు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు మాచర్ల బాలరాజు తెలిపారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జంక్షన్‌లో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ కన్వీనర్, జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ అధ్యక్షతన స్ఫూర్తి యాత్రను శనివారం ప్రారంభించగా నర్సయ్య, రాజు, బాలరాజు మాట్లాడారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, మహాత్మ జ్యోతిరావుపూలే వంటి మహనీయుల చరిత్రను సమాజం అధ్యయనం చేయాలని ఆకాంక్షించారు. ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించేలా మూ(డ్రో)జులపాటు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా యాత్ర ముగుస్తుందని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరూ మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని సమాజ ఉన్నతికి పాటుపడాలని కోరారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

తల్లి మృతికి కారకుడైన కుమారుడి రిమాండ్

పర్వతగిరి : మండలంలోని గుడితండాకు చెందిన భూక్య రంగమ్మ (65) మృతికి కారకుడైన ఆమె పెద్ద కుమారుడు రవిని పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. రవి చేయి చేసుకోవడంతో రంగమ్మ ఆస్పత్రి పాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు కావడంతో రవి పోలీసులకు లొంగిపోయాడు.

కమిటీ ఎన్నిక

పర్వతగిరి : ఈనెల 14న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి నిర్వహించనున్న క్రమంలో రావూరులో యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలతో కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్ము రమేశ్, ఉపాధ్యక్షుడుగా వేల్పుల భాస్కర్, కార్యదర్శిగా ఆబర్ల రవి, సహాయ కార్యదర్శిగా కొమ్ము వెంకన్న, కోశాధికారిగా కందికట్ల భాస్కర్, సలహాదారుగా కొమ్ము భాస్కర్, సభ్యులుగా యూత్ నాయకులు నవీన్, రాకేశ్, ఆబర్ల రమేశ్, రంజిత్, అజయ్, అభినవ్, కొండేటి రామకృష్ణ, కొమ్ము బాబు, కొమ్ము దర్గయ్య, పొన్నాల కొమ్మాలు ఎన్నికయ్యారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం



నర్సంపేట : పట్టణంలోని సిటిజన్స్ క్లబ్‌లో (నేడు) ఆదివారం లంబాడీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసునాయక్ తెలిపారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జాతి గౌరవాన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలోని లంబాడీ విద్యార్థులు, మేధావులు, కార్మికులు, కర్షకులు కాపాడుకోవాలన్నారు. సమ్మేళనానికి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూక్య జగన్, నాయకులు అజ్మీర శంకర్, రమేశ్‌నాయక్, సుభాష్‌నాయక్, బోడ సురేశ్, బోడ మురళీ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నర్సంపేట : ఈనెల 27న ములుగులో నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి ప్రతాప్‌రెడ్డి, తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ఈర్ల పైడి పట్టణంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి, పైడి మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండను తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోడి సోమన్న, ఆబర్ల రాజన్న, భూమా అశోక్, కడారి సురేశ్, శివరాత్రి కుమార్, దండుగుల సంపత్, అనుముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ పక్షం'



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు వేడుకగా సీమంతం, చిన్నారులకు అన్నప్రాసనతోపాటు అక్షరాభ్యాసం కార్యక్రమాలు చేపట్టారు. హ్యాండ్‌వాష్, పౌష్టికాహారం, పాల ప్రాముఖ్యత, ఐరన్ మాత్రలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నూనె కవిత, కూన మల్ల స్వరూప, భూక్య సరిత, ఆయాలు పెండ్యాల జ్యోతి, ఏఎన్‌ఎం రాణి, ఆశాకార్యకర్తలు రేణుక, చీనమ్మ, భద్రమ్మ, వీఓ అధ్యక్షురాలు దోని స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలోనే సుపరిపాలన



నల్లబెల్లి : జెండా ఎగరేస్తున్న ధర్మారావు

● మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు

నల్లబెల్లి : బీజేపీ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన అందుతుందని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ మార్తినేని ధర్మారావు తెలిపారు. మండలంలోని ముచ్చింపులలో శనివారం నిర్వహించిన 'గావ్ చలో.. బస్తీ చలో' కార్యక్రమాన్ని ఆయన పార్టీ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం బీజేపీ శ్రేణులు హనుమన్ ఆలయాన్ని సందర్శించి పరిసరాలను శుభ్రం చేశారు. పల్లె దవాఖానాను, గ్రామ పంచాయతీ భవనాన్ని సందర్శించారు. ప్రధాన కూడళ్లలో ప్రజలతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్, జిల్లా కార్యదర్శి తడుక అశోక్ గౌడ్, ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వడ్డేపల్లి నర్సింహరాములు, గొట్టికొప్పుల రాంబాబు, నాయకులు కమ్మంపాటి పుల్లారావు, రామచంద్రారెడ్డి, బొమ్మిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, గడ్డం అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థాపక దినోత్సవం

పర్వతగిరి : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కన్వీనర్ బత్తిని దేవేందర్ ఆధ్వర్యంలో పార్టీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకుడు కుందూరు మహేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని శ్రేణులను కోరారు. గ్రామాల్లో పార్టీ జెండా ఎగరేయాలని సూచించారు. ప్రధాని మోదీ సందేశాన్ని కోకన్వీనర్ గొల్లపల్లి సంతోశ్‌కుమార్ చదివి వినిపించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో నాయకులు కుడికాల శ్రీధర్, పిచ్చిరెడ్డి, జలంధర్, ప్రతాప్‌రెడ్డి, వీరస్వామి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వ ప్రాధాన్యం



పెర్కవేడులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

● మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి

రాయపర్తి : రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని జేతురాంతండా, రాయపర్తి, మహబూబ్‌నగర్, రాగన్నగూడెం, పెర్కవేడు, బంధనపల్లి, కొత్తూరు, కొండాపురం, ఊకల్, బాల్‌నాయక్‌తండా, సన్నూరు, వెంకటేశ్వరపల్లి, పోతిరెడ్డిపల్లి, జగన్నాధపల్లి, గట్టికల్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఐకేపీ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి గిట్టుబాటు ధర, బోనస్ పొందాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమాల్లో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఏపీఎం కిరణ్‌కుమార్, నాయకులు సుధీర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఊగ మునిత, ఉల్లెంగుల యాదగిరి, ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వనజారాణి, అఫ్రోజ్, కోటేశ్వర్, సుదర్శన్‌రెడ్డి, ఖాజా, పుల్లూరు దామోదర్, తీగల సాయిలు, గడ్డం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకులుగా కాంగ్రెస్ నాయకులు

● మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు

ఖానాపురం : కాంగ్రెస్ నాయకులు రైతు వ్యతిరేకులుగా తయారయ్యారని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాకాల ఆయకట్టు కింద రైతులు నష్టపోగా స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు కనీసం పరిశీలించలేదని అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు సైతం పట్టించుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. అధికారులకు, కాంగ్రెస్ నాయకులకు తీరిక లేకుంటే తామే బాధిత రైతుల వివరాలతో నష్టాన్ని వివస్తామన్నారు. పరిహారం ఇప్పించే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. సెటిల్‌మెంట్లు, పదవుల కోసమే దృష్టి పెడుతున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో నాయకులు భూస అశోక్, బంధారపు శ్రీనివాస్, ఉపేందర్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, కోరె సుధాకర్, రాము, బాలు, మచ్చిక అశోక్, బొప్పిడి పూర్ణ, ఆబోతు అశోక్, బోడ పూలు, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్‌రావు

'రాజీవ్ యువ వికాసం' గడువు పొడిగించాలి

● ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేశ్

నర్సంపేట రూరల్ : రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పొడిగించాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ కోరారు. నర్సంపేటలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతీ యువకులు కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ ప్రతాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. సర్టిఫికెట్లు అందడంలో జాప్యం జరుగుతున్న క్రమంలో దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలని కోరుతూ ట్విట్టర్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా నిరుద్యోగ యువతీ యువకులు మీ సేవా కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్లు, తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న దుస్థితి నెలకొందని చెప్పారు. గత రెండ్రోజులుగా సర్వర్ డౌన్ ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి గడువు పెంపునకు అధికారులను ఆదేశించాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రావణ్, శివకుమార్, ప్రసన్న కుమార్, గౌతమ్, మహేందర్, అభినవ్, సాయిచరణ్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పర్వతగిరి : చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన అనంతారంలో చోటు చేసుకుంది. ఎస్సై బోగం ప్రవీణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మొగుళ్ల వినోద్ (33) కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 11న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించాక మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యం

అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం చెరువులో లభ్యమైంది. ఎస్సై ప్రవీణ్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బరిగెల గోపమ్మ (65) ఈనెల 11న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గోపమ్మ బంధువు పరమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా, గోపమ్మ మృతదేహం పోలుకమ్మ చెరువులో శనివారం కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం మృతదేహానికి పంచనామా నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.